క్లుప్తంగా

నేడు 'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

పాల్వంచరూరల్: స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 3గంటలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా తీయనున్నట్లు తహసీల్దార్ రంగాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించడానికి గురువారం కొత్తగూడెం క్లబ్‌లో సమావేశం జరుగనుందని తహసీల్దారు రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రాథమిక ఎంపిక (లాటరీ) ద్వారా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు ఉదయం 10.30 కల్లా హాజరు కావాలని కోరారు.

తునికాకు బోనస్ చెల్లించాలి



మాట్లాడుతున్న రేపాకుల శ్రీనివాస్

టేకులపల్లి: తునికాకు కార్మికులకు 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని వినోదరావు రవికుమార్ భవన్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతర పేదలకు రెండో పంటగా తునికాకు సేకరణ ఉంటుందన్నారు. వారి శ్రమతో సేకరించిన తునికాకు ద్వారా అందవలసిన బోనస్ సంవత్సరాల తరబడి కార్మికులకు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రూ.200 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం వాటిని వెంటనే పంపిణీ చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ తునికాకు కట్ట రేటు రూ.3లకు పెంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పూనెం స్వామి, కడుదుల వీరన్న, ఈసం నరసింహారావు, దొడ్డ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రీతికి నివాళి


నివాళి అర్పిస్తున్న గ్రామపెద్దలు

టేకులపల్లి: కాకతీయ మెడికల్ కాలేజీలో సీనియర్ వేధింపులతో మృతి చెందిన మెడికల్ విద్యార్థి ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కారకుడైన సైఫ్‌ని కఠినంగా శిక్షించాలని గ్రామపెద్దలు, యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి తొమ్మిదో మైలుతండాలో గ్రామ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో ప్రీతికి సంతాప సభ నిర్వహించారు. గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అర్జున్, సీతారాం, రాజు, మంగీలాల్, నరేష్, శివ, యుగంధర్, శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

జూలూరుపాడు: ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా పెంచాలని ఎంపీడీఓ కేవీఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఉపాధి పనులకు కూలీలందరూ వచ్చే విధంగా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, మరుగుదొడ్డి నిర్మించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణపై అలసత్వం ప్రదర్శించరాదన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ డి.రామారావు, ఈజీఎస్ ఏపీఓ డి.రవికుమార్, టీఏలు సుహాసిని, నాగమణి, స్వాతి, ప్రసాద్, శివకృష్ణ, జోదాబాయి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కేసు నమోదు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఇసుక లారీ.. చాతకొండ రహదారి పక్కనున్న గప్‌చుప్ బండిని బుధవారం ఢీకొట్టింది. అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై ఎస్ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ!

- ఏడాది క్రితం నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు


రెయిలింగ్ లేకుండా ప్రమాదకరంగా ఉన్న భేతాళపాడు పెద్దవాగు బ్రిడ్జి

జూలూరుపాడు: పడమటనర్సాపురం – భేతాళపాడు గ్రామాల మధ్య బీటీ రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. 2015లో పడమటనర్సాపురం – భేతాళపాడు గ్రామాల మధ్య సీఆర్ఆర్ నిధులు రూ.2.20 కోట్లతో నిర్మించారు. బీటీ రోడ్డు నిర్మించిన తరువాత తిరిగి రెండున్నరేళ్ల లోపు రోడ్డు నిర్వహణ పనులు చేపట్టాల్సిన ఉన్నప్పటికీ నిర్వహణ గ్రాంటు నిలిచిపోవడంతో పనులు చేపట్టలేదు. గత ఏడేళ్లలో బీటీ రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కుంగి పగుళ్లు రావడంతోపాటు, గుంతలు ఏర్పడటంతో అస్తవ్యస్తంగా తయారైంది. భేతాళపాడు గ్రామ పంచాయతీ రాచబండ్లకోయగూడెం, గొల్లగూడెం, భేతాళపాడు, పీక్లాతండా, టాక్యాతండా, పంతులుతండా, చీపురుగూడెం, రేగళ్లతండా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. భేతాళపాడు గ్రామ పంచాయతీ గ్రామాల ప్రజలు మండల కేంద్రం జూలూరుపాడుకు చేరుకోవడానికి ఇదే ప్రధాన రహదారి. బీటీ రోడ్డు మరమ్మతుల కోసం 2022 జనవరిలో ఎంఆర్ఆర్ నిధులు రూ.74 లక్షలు మంజూరైనప్పటికీ టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు రెండుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. నిధులు మంజూరై ఏడాది గడిచినా పనులకు మోక్షం కలగడం లేదు. భేతాళపాడు గ్రామ సమీపంలోని పెద్దవాగు బ్రిడ్జి, పడమటనర్సాపురం సమీపంలో గల తుమ్మలవాగు లోలెవల్ బ్రిడ్జిలకు సైడ్‌వాల్స్ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. భేతాళపాడు పెద్దవాగు బ్రిడ్జి అత్యంత ప్రమాదకరంగా ఉంది. బైక్, ఆటో, కారు, ట్రాలీ, కారు, స్కూల్ బస్సులు, వ్యాన్‌లు, లారీలు తిరుగుతూ ఉంటాయి. ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకువస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడంతోపాటు, బ్రిడ్జిల వద్ద ప్రమాదాలు జరగకుండా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జూలూరుపాడు పీఆర్ ఏఈ నాగేందర్‌ను వివరణ కోరగా.. పడమటనర్సాపురం నుంచి భేతాళపాడు వరకు 3 కిలోమీటర్ల బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.74 లక్షలు మంజూరయ్యాయని రెండు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. త్వరలో మరోసారి టెండర్ నిర్వహించి రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తామని చెప్పారు.


పడమటనర్సాపురం-భేతాళపాడు మధ్య దెబ్బతిన్న బీటీ రహదారి

రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నది


భేతాళపాడు నుంచి పడమటనర్సాపురం వరకు బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. రోడ్డంతా కుంగి నెర్రెలు రావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. గత ఏడేళ్లలోనే రహదారి తీవ్రంగా దెబ్బతింది. బైక్‌పై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది.

– చౌడం లక్ష్మీనారాయణ, భేతాళపాడు

ప్రమాదకరంగా ఉంది


భేతాళపాడు – పడమటనర్సాపురం మధ్యగల రహదారి ప్రమాదకరంగా ఉంది. రాత్రివేళల్లో బైక్‌పై రావడమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వస్తున్నాం. ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– ధరావత్ కిషన్, పీక్లా తండా

అధికారులు పట్టించుకోవడం లేదు


రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల సర్వసభ్య సమావేశంలో కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేపట్టాలి.

– గుగులోత్ రాందాస్, సర్పంచ్, భేతాళపాడు

విద్యుత్ ఉద్యోగుల నిరసన


పాల్వంచ: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


సూపర్‌బజార్(కొత్తగూడెం): డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ ఇచ్చే వరకు పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేసారు. బుధవారం స్థానిక కేటీపీఎస్ 5,6,7 దశల కర్మాగారాల్లో భోజన విరామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏడాది గడుస్తున్నా ఇంకా పీఆర్సీ ప్రకటించకపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని లేదంటే నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంగీలాల్, సుధీర్, బ్రహ్మాజీ, శ్రీనివాస్, మజీద్, మహేశ్, సీతారాంరెడ్డి, వెంకటేశ్వరరావు, నరసింహారావు, రవీందర్, కోటేశ్వరరావు, గిరిధర్, రవీందర్ పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ సంస్థలో 2022 పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఆర్టిజన్లకు కన్వర్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మోహనరావు, హేమంత్, రాజేష్, పులి గణేష్‌బాబు, జి.నరసింహారావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: లయన్స్ క్లబ్ పాల్వంచ గోల్డ్ అధ్యక్షుడు చాట్ల శ్రీనివాసరావు పుట్టినరోజు పురస్కరించుకుని బుధవారం నిరుపేద దివ్యాంగుడి జీవనోపాధి నిమిత్తం రూ.10 వేల నగదు అందించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుట్టా నాగేశ్వరరావు, పోటు సతీశ్, చేపూరి బ్రహ్మాచారి, కాటా నవీన్, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి...


నగదు అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వితరణ అందించారు. ప్రెగళ్లపాడు పంచాయతీ పడమటిగుంపు గ్రామానికి చెందిన చీమల భవానీ కుమార్తె జ్ఞానేశ్వరి (14 నెలలు)కి బ్రెయిన్‌లో నరం సమస్యతో కాళ్లు, చేతులు పని చేయడం లేదు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం కోసం ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు బుధవారం రాత్రి బాధితురాలి ఇంటికి వెళ్లి రూ.15వేలు వితరణగా అందజేశారు.

బాధితురాలికి సొంత ఇల్లు కూడా లేదని దాతలు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండబత్తుల శ్యామ్, కోరం శ్రీకాంత్, కొత్తచిట్టి రాజు, జార మల్లేష్, లక్కినేని రంగా, లింగమల్లు, హచ్చు, దన్ను, బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న పుష్కర బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి కందా సింహాద్రి ఆనంద కుమార్ చార్యులు ఆధ్వర్యంలో తొలిరోజు పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. మైసమ్మ తల్లి, షిర్డీ సాయిబాబా, అంజనేయ స్వామి దేవాలయం, బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లికి చీరె, సారె, పట్టు బట్టలు అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్వాల సత్యనారాయణ, సక్కుబాయమ్మ, సత్యవతి, రత్నమ్మ, ముత్యాల కోటేశ్వరరావు, వంగా రమేశ్, గడిదేశి వెంకట్, వెలిగంటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేస్తాం


ఇల్లెందు: పట్టణంలో అంగన్‌వాడీల ర్యాలీ..


టేకులపల్లి: ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


పాల్వంచరూరల్: సీడీపీఓ కార్యాలయం ఎదుట..

ఇల్లెందు: అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, ఆన్‌లైన్ రిపోర్టులు చేయలేమని, గ్రాట్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఈఎస్ఐ, బీమా సదుపాయం కల్పించాలని సీఐటీయూ అనుబంధ జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి జగదాంబా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోరుతూ 24 గంటల ఆందోళన చేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో చింతా రాంబాయి, అబ్దుల్ నబీ, కృష్ణపాల్గొన్నారు.

టేకులపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలో భాగంగా తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వర్కర్ అనే పదం బాగలేదని టీచర్ అని పేరు పెట్టారు కానీ, ఏ ఒక్క సౌకర్యం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్, కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలేమీ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

47 సంవత్సరాలుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ షుగర్, బీపీలు వచ్చిన వాళ్లకు రిటైర్మెంట్ కల్పించి రూ.4లక్షల ఇవ్వాలని కోరారు. వస్తున్న జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించి వారితో సమానంగా వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిపోర్టులు ఇవ్వబోమని, రాతపూర్వకమైన రిపోర్టులే అందజేస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలపై చేస్తున్న సమ్మెకు అంగన్‌వాడీ టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి కొండపల్లి శకుంతల, సారమ్మ, జయశ్రీ, పద్మ, రాజేశ్వరి, కౌసల్య, సుశీల, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే నిరవధిక సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. బసవతారక కాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించి, పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ కనకదుర్గకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో దొడ్డరవికుమార్, కె.సత్య, పండగ వెంకటరమణ, రాజ్యలక్ష్మి, రమ్య, చుక్కమ్మ, స్వర్ణలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ వేడుకలు


సంపత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయం

టేకులపల్లి: సంపత్‌నగర్ కొండపై వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలకు ఆలయం ముస్తాబైంది. నేటి నుంచి కల్యాణ వేడుకలు ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం అభిషేకం, స్వామి వారి అలంకరణ, పెండ్లి కొడుకును చేయుట, తీర్థ ప్రసాద గోష్టి, సాయంత్రం విష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, అంకురార్పణ, ధ్వజారోహణ, నిత్యపూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి, శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, యాగశాల అర్చన, నిత్యహవనం, 10 గంటలకు స్వామివారి కల్యాణ మండప ప్రవేశం, 10.30 గంటలకు స్వామి వారి కల్యాణం ప్రారంభం, మధ్యాహ్నం 12.39కి సుముహూర్తం, అనంతరం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకలను తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

కిచెన్ గార్డెన్‌ను పెంచుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మలజ్యోతి

జూలూరుపాడు: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ చండ్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి అన్నారు. బుధవారం రాచబండ్లకోయగూడెం, గాంధీనగర్, పడమటనర్సాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో సెక్టార్ సమావేశాలు నిర్వహించారు. సీడీపీఓ నిర్మలజ్యోతి హాజరై మాట్లాడారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం లేనిచోట మిషన్ భగీరథ కుళాయి ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పిల్లల బరువు, ఎత్తుల వివరాలు, రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించే విధంగా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని చెప్పారు. సమావేశాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, నాగమణి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై శ్రద్ధ తీసుకోండి


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పాల్వంచ: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర పరిశీలకులు యానాల వెంకటరెడ్డి సూచించారు. పరీక్షల సన్నదతపై రాష్ట్ర పరిశీలకుల బృందం స్థానిక బాలికోన్నత పాఠశాల, బొల్లేరుగూడెంలోని ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రీఫైనల్ పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు అభ్యాసన దీపికలను అందజేసిందని, వాటిని సక్రమంగా వినియోగించి వెనుకబడిన పిల్లలు కూడా ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని కోరారు. సాయంత్రం అందించే అల్పాహారం నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి పదో తరగతి పిల్లల తల్లిదండ్రులకు రాసిన లేఖను పిల్లల ద్వారా చేరే విధంగా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో పరిశీలన బృందం సభ్యులు వెంకటయ్య, బాల మురళీ కృష్ణ, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగేశ్వర్, ప్రధానోపాధ్యాయులు పద్మలత, ఆదినారాయణ పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి


వైల్డ్‌లైఫ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పాల్వంచరూరల్: వన్యప్రాణి సంరక్షణ పేరుతో రైతులకు త్రీఫేస్ విద్యుత్‌ను ఇవ్వకపోవడం సరికాదని మైలారం గ్రామపంచాయతీలో రైతులకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం రైతులు వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ సూపరింటెండెంట్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు ముత్యాల విశ్వనాథం మాట్లాడారు. మైలారం పంచాయతీలో గిరిజనులకు గిరిజన ఆవాస్ కింద మంజూరైన విద్యుత్ మోటార్లకు త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్ నిలిపివేయడం వలన రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని వన్యప్రాణి సంరక్షణ పేరుతో రైతులను అడ్డుకోవడం సరికాదని వెంటనే త్రీఫేస్ విద్యుత్‌కు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, దిండి లక్ష్మీపతి, అన్నారపు వెంకటేశ్వర్లు, గూడెపుడి రాజు, సత్యనారాయణ, పాషా, శ్రీనివాస్, కారం జనార్దన్, గోపాల్, హనుమాన్, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: కొత్తగూడెం పట్టణంలో ఏప్రిల్ 2, 3 తేదీలలో నిర్వహిస్తున్న ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి రాసుద్దీన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని హమాలీ అడ్డా వద్ద బుధవారం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న ప్రదర్శన, బహిరంగ సభ, 3వ తేదీన ప్రతినిధుల సభ నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతినిధుల సభలో చర్చించి భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సీతారామయ్య, విశ్వనాథం, రాంసింగ్, లింగయ్య, రాంబాబు, గట్టయ్య, మారుతరావు, వాసు, నెల్లూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో కంటి వెలుగు శిబిరం

చుంచుపల్లి: విద్యానగర్ గ్రామ పంచాయతీలో అధికారులు బుధవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు భారీగా హాజరై కంటి పరీక్షలు చేసుకున్నారు. సర్పంచ్ గోవింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దృష్టి లోపం ఉన్న వాళ్లకు వైద్యసిబ్బంది కళ్లద్దాలు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సువర్ణ, డీఈఓ శ్రీవాణి, ఫరూఖ్, ఏఎన్ఎంలు వినోద, భాగ్యలక్ష్మి, లలిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


అటెన్షన్ ప్లీజ్

శిథిలావస్థలో పాఠశాల భవనం


టేకులపల్లి మండలం సులానగర్‌లోని ప్రాథమిక పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. 25 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. ఆఫీసు గది, వరండాతో పాటు పక్కనే ఉన్న శిథిల భవనంలోనూ తరగతులు కొనసాగించాల్సి వస్తోంది. వర్షం పడితే ఇక అంతే సంగతులు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇంటికి వెళ్లిపోవడమే... ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : ఠాకూర్ రాంసింగ్, ఎంఈవో, టేకులపల్లి
సెల్ నంబర్ : 98495 53542